క్లుప్తంగా

అపార్ట్‌మెంట్‌లో రక్తపింజరి



పామును ప్లాస్టిక్ డబ్బాలో బంధించిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మ

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం గాంధీనగర్ శివారు జీఎస్ఆర్-2 కాలనీలోని జయ వీర్ గ్రాండ్ అపార్ట్‌మెంట్‌లో రక్త పింజరి పాము గురువారం రాత్రి కలకలం సృష్టించింది. అపార్ట్‌మెంట్‌లో పాములు బుసుల కొడుతున్న వైనాన్ని విని అందులో నివసిస్తున్న కుటుంబాలు ఆందోళనకు గురయ్యారు. అపార్ట్‌మెంట్ వాసులు స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి పామును చాకచక్యంగా పట్టుకుని సీసాలో బంధించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాజ్

అమలాపురం టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తనయుడు జీవీ శ్రీరాజ్ ఆరోపించారు. అమలాపురంలో ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఐఏఎస్ అధికారులను సైతం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేలా వారిపై ప్రభుత్వం పెత్తనం చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు మచ్చుకైనా కనిపించడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గడువు ముగిశాక తన సోదరుడు సుందర్ పేరును ఆఖరి పేజీలో 34వ సంఖ్యకు తీసుకుని వచ్చారని పేర్కొన్నారు. పట్టభద్రులు కూటమి ప్రభుత్వ కుట్రలను గమనిస్తున్నారని, ముఖ్యంగా టీడీపీకి ఓట్లు వేసే స్థితిలో పట్టభద్రులు లేరని స్పష్టం చేశారు. మాల మహానాడు నాయకలు బుద్ధరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతా భీమాబాయ్ జయంతి



భీమాబాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: ప్రపంచ మేధావిని దేశానికి అందించిన భీమాబాయ్(అంబేద్కర్ తల్లి) దేశానికి ఆదర్శ మూర్తిగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక బుద్ధపార్కులో భీమాబాయ్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డి నాగేశ్వరరావు, పొద్దోకు బాలు, కాశి సింహాద్రివరియా, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పోతాబత్తుల చిట్టిబాబు, గొల్లపల్లి గోపి, గోడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినతుల వెల్లువ

యానాం: యానాం విచ్చేసిన ఎంపీ వైథిలింగంకు స్థానికులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ అతిథిగృహం వద్ద వివిధ సమస్యలను ఆయన వద్ద ప్రస్తావించారు. రిటైర్డ్ ఆర్ఏఓ బలరామ్, సివిల్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి తదితరులు స్థానిక చమురు సంస్థల వల్ల తీవ్రంగా ప్రభావితమవుతున్న రైతులకు సీఎస్ఆర్ పరిహారం అందించాలని వినతి పత్రం అందజేశారు. పైపులైన్లకు, స్టోరేజీ ట్యాంకులకు దగ్గరగా ఉన్న దరియాలతిప్ప, గిరియాంపేట తదితర గ్రామాలకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఓఎన్‌జీసీ అందించే నష్ట పరిహారం మత్స్యకారులతో పాటు మిగిలిన అన్ని కులాలకు అందజేయాలని, ఉపాధి కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన ఎంపీ వైథిలింగం మాట్లాడుతూ వేటకు వెళ్లలేని వారికి సైతం ఓఎన్‌జీసీ పరిహారం ఇస్తున్నారని, దీంతో మిగిలిన వర్గాలకు అన్యాయం జరుగుతుందని దీనిపై పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెల్లం చిన్న, జనిపల్లి వెంకన్న బాబు, మట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయ నిర్మాణం



ఇమ్మిడివరప్పాడులో స్వామివారి ఆలయం

అమలాపురం రూరల్: ఇమ్మిడివరప్పాడు గ్రామంలో భక్తుల సహకారంతో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఆలయాన్ని నిర్మించారు. ఈనెల 17వ తేదీన స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. సోమవారం ఉదయం 10.45 గంటలకు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకోవాలని కోరుతున్నారు.

సామూషికంగా నివారణ

- రబీ వరిచేలకు ఎలుకల బెడద
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- ఎరను పంపిణీ చేసిన అధికారులు





అమలాపురం మండలంలో తాండవపల్లిలో ఎలుకల మందు పెట్టుతున్న రైతులు

అమలాపురం రూరల్: రబీ వరి పంటలకు ఎలుకల బెడద ఎక్కువైంది. పంటను కొరుకుతూ నష్టం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా వరి పంటను మూషికాలు నాశనం చేస్తున్నాయి. రబీ సీజన్‌లో ఆకుమడుల దశ నుంచి పంట కోత కోసే వరకు ఈ సమస్య రైతులకు తప్పడం లేదు. ఎలుకలను సమర్థంగా అరికట్టాలంటే రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన చర్యలు చేపట్టడం వల్లే సాధ్యమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అమలాపురం నియోజకవర్గ పరిధిలో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లోనూ, ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల్లో వరితో పాటు ఉద్యానవన పంటలైన కొబ్బరి, అరటి, కాయకూరల తోటలకు ఎలుకల బెడద ఉంది. ప్రస్తుతం రబీ వరి పంట దుబ్బు చేసి పిలకలు వేసే దశలో ఉంది. ఈ దశలో ఎలుకల వల్ల కలిగే నష్టం అపారంగా ఉంటుంది. ఎలుకలు నీటి మట్టానికి 6 సెంటీమీటర్ల ఎత్తులో వరి పిలకలను కొరికి వేస్తున్నాయి. దీంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు.

గుర్తించే విధానం

ఎలుకలు సంచరించే పొలం గట్లపై బొరియలు ఉంటాయి. పొలంలో కొరికి వేసిన వరి పిలకలు, దుబ్బులు పడి ఉంటాయి. పొలంలోని బురదలో ఎలుకల పాదముద్రలు కనిపిస్తాయి. ఎలుకలు విసర్జించిన పదార్థాల ద్వారా వాటి ఉనికిని సులభంగా ప్రతి ఒక్కరూ గుర్తించవచ్చు.

నివారణ చర్యలు

- రైతులు తమ పొలం గట్లపై కలుపు మొక్కలను పూర్తిగా తొలగించి శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా బ్రోమోడయోలిన్ ఎరతో ఎలుకలను సామూహికంగా నివారించాలని మండల వ్యవసాయఅధికారి చెబుతున్నారు. ఒక ఎకానికి 192 గ్రాములు నూకలు, 4 గ్రాముల బ్రోమోడయోలిన్ మందు, 4 గ్రాములు చొప్పున వేరు శనగతో కలిపి గ్లౌజ్‌లు వేసుకుని మనిషి చేతులు తలగకుండా ఎలుకల మందు తయారు చేయాలి. ఈ మందు 20 పొట్లాలు కట్టినట్లుగా కట్టి ఎలుక బొరియలలో పెట్టాలి. మొదటి రోజు ఎలుక బొరియలను గుర్తించి మట్టితో కప్పివేయాలి. రెండో రోజు మట్టితో కప్పిన బొరియలను చూస్తే తెరుచుకున్న బొరియలు కనిపిస్తాయి. ఆ బొరియల వద్ద 10 గ్రాముల బ్రోమోడయోలిన్ ఎర పొట్లాలను ఉంచాలి. దీంతో ఆ ఎరను తిన్న ఎలుకలు చనిపోతాయి.
- ఇక రెండో విధానంలో వేటగాళ్ల ద్వారా ఎలుక బుట్టలు వేయించి ఎలుకలను ఆరికట్టవచ్చు. అయితే ఈ విధానంలో వేటగాళ్లు ఒక్కో ఎలుకకు రూ.50 వరకు తీసుకుంటారు.
- మరో విధానంలో ఎలుక బొరియలో పొగ పెట్టి ఎలుకలను చంపుతారు. ఇలా చేస్తే ఒక్కో ఎలుకకు రూ.50 నుండి 60 వరకు తీసుకుంటారు. ఈ రెండు విధానాలు అధిక ఖర్చుతో కూడిన పని కావడంతో రైతులంతా బ్రోమోడయోలిన్ ఎర ద్వారానే ఎలుకల నివారణ చేయడం సులభంగా జరిగే పని అని వ్యవసాయాధికారులు చెబున్నారు. అయితే ఏ విధానంలో చేసినా రైతులంతా సామూహికంగా ఈ పని చేస్తేనే ఎలుకలను సమర్థంగా అరికట్టగలమని వారు చెబున్నారు.

సామూహికంగానే నిర్మూలించడం సాధ్యం



రబీ పంటకు ఎలుకల బెడద ఎక్కువగానే ఉంటుంది. ఎలుకలను నిర్మూలించడం సాధ్యం కాదు. సామూహికంగా బ్రోమో డయోలిన్ మందును పెట్టడం ద్వారా మాత్రమే సమర్థంగా అరికట్టగలం. ఎలుకలను అరికట్టడానికి అవసరమైన బ్రోమోడయోలిన్ మందు రైతు సేవ కేంద్రాలకు పంపిణీ చేయడం జరిగింది. దీనిపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మందును ఉచితంగా అందజేస్తున్నాం. అమలాపురం సబ్ డివిజన్‌లో ముమ్మరంగా ఎలకల మందు పంపిణీ చేశాం రైతులు సామూహికంగానే ఎలుకలు నిర్మూలనం చేపట్టాలి

– ఎంఏ షంషి, సహాయ వ్యవసాయ సంచాలకులు అమలాపురం

రబీ సాగు ఇలా..

అమలాపురం నియోజకవర్గంలో అమలాపురం రూరల్ మండలంలో రబీలో 5,100 ఎకరాల్లో వరిసాగు చేశారు. 23 రైతు సేవ కేంద్రంలో పరిధిలో 1892 మంది రైతులకు 26 కేజీల బ్రోమోడయోలిన్ మందు ఉచితంగా పంపిణీ చేశారు. అల్లవరం మండలం పరిధిలో 4వేల ఎకరాలో వరిసాగు చేశారు. 19 రైతు సేవ కేంద్రాల పరిధిలో 1786 మంది రైతులకు 24 కిలోల బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేశారు. ఉప్పలగుప్తం మండలం పరిధిలో 7,100 ఎకరాల వరిసాగు చేశారు. 14 రైతు సేవ కేంద్రాల పరిధిలో 2234 మంది రైతులకు 35 కేజీల బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేశారు.

విద్యుత్‌చార్జీల పెంపునకు నిరసన

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా పెంచిన విద్యుత్‌చార్జీలకు నిరసనగా ఎంపీ వైథిలింగం సారథ్యంలో స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌చార్జీలతో పేద, మధ్యతరగతి ప్రజలపై అధిక భారం పడుతుందని బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. వీటిపై ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. పాత మీటర్ల స్థానంలో స్మార్ట్‌మీటర్లు పెట్టడంతో అధిక చార్జీలు పడుతున్నాయని, ఫిక్స్‌డ్, సర్‌చార్జీల పేరిట వేలాది రూపాయిల మేర భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. తక్షణం విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించకపోతే భారీ ఆందోళనలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

దొమ్మేటిపేట డ్రైన్ పరిశీలన

సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న దొమ్మేటిపేట డ్రైనేజీని ఎంపి వైథిలింగం పరిశీలించారు. అనంతరం ఆ గ్రామస్తులు మాట్లాడుతూ డ్రెయినేజీ వల్ల అనారోగ్యబారిన పడుతున్నామని, వంటపాత్రలు సైతం నల్లగా మారిపోతున్నాయని తెలిపారు. తాగునీరు కలుషితం అవుతుందని తమ గోడును వెళ్లబోసుకున్నారు. తక్షణం ఈ సమస్యను పరిష్కరిస్తానని ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సీఎం నారాయణసామి, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు అర్ధాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రితో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

- వైద్య సేవలు అందిస్తున్న స్వీపర్
- మండి పడుతున్న రోగులు



కాట్రేనికోన పీహెచ్‌సీలో రోగులకు డ్రెస్సింగ్ చేస్తున్న స్వీపర్

కాట్రేనికోన: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వీపర్ రోగులకు వైద్య సేవలు అందిస్తోంది. గాయాలతో వచ్చిన వ్యక్తికి తెల్ల రంగు అరుకుతో శుభ్రం చేసి ఎర్ర రంగు అరుకు వేసి కట్టుకట్టానని స్వీపర్ తెలిపింది. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఎంత నిర్లక్ష్యం ఉన్నారనే దానికి ఇదే నిదర్శనం.

మండలంలో పల్లంకుర్రు మహిపాల చెరువు రహదారిపై గురువారం రాత్రి 8 గంటలకు పి.లక్ష్మివాడ వద్ద ఎదురుగా వస్తున్న రెండు మోటరు సైకిళ్లు ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని కాట్రేనికోన పీహెచ్‌సీకి తరలించారు. విధులలో ఉన్న స్టాఫ్ నర్స్ స్వీపర్‌ను క్లీన్ చేసి డ్రెస్సింగ్ చేయమని ఆదేశించింది. ప్రమాదంలో గాయపడిన వ్యక్తుల గాయాలను స్వీపర్ శుభ్రం చేసి డ్రెసింగ్ చేసింది. కనీస అర్హత లేని స్వీపర్‌తో వైద్యం చేయించిన ఆసుపత్రి సిబ్బంది తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సు రోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలున్నాయి. నెల రోజుల క్రితం కాలు నొప్పితో వెళ్లిన పాపకు కాలుతో తొక్కి పరీక్ష చేసిందని పాప తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గత రెండేళ్ల క్రితం ఇదే స్వీపర్‌తో రోగులకు డ్రెస్సింగ్ చేయించిన సంఘటనలు ఉన్నాయి. రోగులపై ఆరోగ్య సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై మండల ప్రజలు మండి పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యు సేవలుపై వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అలసత్వం ఏ పాటిదో ఈ సంఘటన నిదర్శనమంటున్నారు. ప్రసూతి మహిళలకు స్వీపరు పురుడు పోస్తుందని ఆసుపత్రి సిబ్బంది సర్టిఫికెట్ ఇవ్వడం గమనార్హం. దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారి లిఖితను వివరణ కోరగా స్టాఫ్ నర్సును వివరణ తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

సైనిక కుటుంబాలకు బాసటగా సంస్కార భారతి



మాజీ సైనికులను సత్కరిస్తున్న సంస్కార భారతి ప్రతినిధులు

అమలాపురం టౌన్: సంస్కార భారతి జిల్లా శాఖ, అమలాపురం ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పూల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీర జవాన్లకు ఘన నివాళులర్పించారు. ఇదే వేదికపై భరతముని జయంతి, భరత మాత పూజోత్సవ కార్యక్రమాలను సంస్కార భారతి, సర్వీస్ ట్రస్ట్ ప్రతినిధులు నిర్వహించారు. తొలుత సైనిక కుటుంబాలకు సంఘీభావంగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పూల్వామా దాడిలో చనిపోయిన వీర జవాన్ల సాహసోపేతాన్ని సంస్కార భారతి ప్రతనిధులు వివరించారు. ఈ కార్యక్రమాలకు సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం భరత మాత పూజోత్సవాన్ని, భరత ముని జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ సైనికుల భార్యలను సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ఆదిత్య, శ్రీవాగ్దేవి పాఠశాలల విద్యార్థులు పూర్తి వందే మాతర గీతాన్ని ఆలపించి అందరిలోనూ దేశ భక్తి భావాన్ని నింపారు. వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులను కూడా సంస్కార భారతి ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమాల్లో సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్‌తోపాటు కోనసీమ ఎక్స్ సర్వీస్ మెన్స్ అసోసియేషన్, కోనసీమ ఆహార నిధి, ఆజాద్ ఫౌండేషన్, శ్రీవాసవీ క్లబ్, ఎఫ్-3 ఫౌండేషన్, మహిళా వాకర్స్ క్లబ్, శ్రీరామానంద చారిటబుల్ ట్రస్ట్, స్నేహిత ఫౌండేషన్, వివేకానంద సేవా సమతి, జేసీఐ, గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్, గోదావరి ఆర్ట్ అకాడమిల ప్రతినిధులు పాల్గొన్నారు.

తొలి దళిత ముఖ్యమంత్రి సంజీవయ్యకు ఘన నివాళి



సంజీవయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి, బహుముఖ ప్రజ్ఞాశాలి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా అమలాపురంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘన నివాళులర్పించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో జరిగిన సంజీవయ్య జయంతి సభకు నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి అధ్యక్షత వహించారు. సంజీవయ్య చిత్ర పటానికి పార్టీ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటిద్దు బాబి, ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, పార్టీ సీనియర్ నాయకులు మెహబూబ్ షకీలా, పేరి శర్మ, జోగి అర్జునరావు, వస్తా బాబు తదితరులు పాల్గొని సంజీవయ్యకు ఘన నివాళులర్పించారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి

ముమ్మిడివరం: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాలు లర్పించారు. కార్యక్రమంలో ముషిణి శివప్రసాద్, గోడి భాస్కరరావు, గుబ్బల రవి, ఎంటీ ప్రసాద్,మెల్లం శ్రీరాములు, మెండి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



గొల్లవిల్లి పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు



పేరాయిచెరువు పాఠశాలలో విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో కిరణ్‌బాబు, ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం: మండలంలోని ఆయా పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఐదుగురు విద్యార్థినులు శుక్రవారం ఎంపికయ్యారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శవరపు రష్మిత, దూనబోయిన లలిత మణిప్రియ, నేతల జెస్సీకా, పేరాయిచెరువు ఎంపీయూపీ పాఠశాల నుంచి పండు వినోద్ కుమార్, చల్లపల్లి, జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి గెద్దాడి సన్నీ విద్యార్థులు ఈ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ, హెచ్ఎంలు అభినందించారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రసాద్

యానాం: విద్యార్థి దశ నుంచే మంచి ప్రజాస్వామ్య పౌరుడిగా ఉండేందుకు క్రమశిక్షణను మంచి విలువలను అలవర్చుకోవాలని ఇంటర్నెల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసి) కోఆర్డినేటర్ డాక్టర్ కమిడి ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యసనం, క్రమశిక్షణ వంటి అంశాలపై అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శాంతికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సాంకేతిక కాలంలో విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని ఆవిధంగా ఉన్నతస్థాయికి వెళ్లేలా ప్రణాళికా బద్ధంగా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఆర్.ఉమాదేవి, చక్రవర్తి, ఏవీవీఎస్ మూర్తి, కోలా సూర్య ప్రకాష్, శ్రీదేవి, ఖ్వాజాబీ, తోట ప్రసాదరావు, చెల్లి నరేష్, భద్రం, రమేష్ కుమార్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పెయ్య దూడల ప్రదర్శన



పెయ్య దూడలను ప్రదర్శిస్తున్న రైతులు

ఆలమూరు: ప్రభుత్వం అందిస్తున్న కృత్రిమ పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ ఎల్.అనిత అన్నారు. నవాబుపేటలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కృత్రిమ మేలు జాతి ఆరు నెలల లోపు దూడల అందాల ప్రదర్శన జరిగింది. దీనికి డీఎల్‌డీఏ వైద్యాధికారి కళ్యాణి హాజరై ప్రసంగించారు. ఆరోగ్యవంతమైన దూడల పెంపకం ద్వారా అధిక పాలనిచ్చే పాడి పశువులను పొందవచ్చని ఆమె సూచించారు. నట్టల నివారణ మందులు, కాల్షియం, లివర్ టానిక్స్, పాల క్యాన్‌లను అందజేశారు. ఆరు నెలల లోపు దూడల ప్రదర్శనలో ఎంపికైన మూడింటికి బహుమతులు ఇచ్చారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ జి.భాను ప్రసాద్‌రావు, న్యాయనిర్ణేతలుగా వీవీ రమణమూర్తి, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే యానాం అభివృద్ధి



ఎంపీ వైథిలింగం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు, చిత్రంలో మాజీ సీఎం నారాయణసామి, ఎమ్మెల్యేలు

యానాం: నియోజకవర్గ అభివృద్ధికి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, అది ఈ పార్టీతోనే సాధ్యమవుతుందని పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యుడు వి.వైథిలింగం పేర్కొన్నారు. శుక్రవారం యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా దవులూరి కాంప్లెక్ ఆవరణలో వందలాది మందితో భారీ బహిరంగ సభ నాయకుడు కాటంశెట్టి రామ్మూర్తి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ద్వారా వందలాది కోట్ల రూపాయిల ఖర్చుతో మౌళిక సదుపాయాలు జరిగాయని ఆ విధంగా పుదుచ్చేరికి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న యానాం ప్రజల శ్రేయస్సే కాంగ్రెస్ ధ్యేయంగా పని చేసిందన్నారు. మాజీ ప్రభుత్వ విప్ అనంతరామన్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు మల్లాడి కృష్ణారావుకు మంత్రి పదవినిస్తే ఆయన పార్టీని మోసం చేశారని తీవ్ర విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీఎం నారాయణసామి, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎం.వైద్యనాథన్, మాజీ రెవెన్యూ మంత్రి పెద పెరుమాళ్, మాజీ ఎమ్మెల్యే కార్తికేయన్, దవులూరి పతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, చెక్కల అరుణ్‌కుమార్, శ్రీమంతుల శ్రీధర్, కోన సూరిబాబు, నందికోళ్ల ప్రవీణ్, వీరబాబు, కొప్పిశెట్టి వాసు తదితరులకు ఎంపీ వైథిలింగం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలో భారీ ర్యాలీ నిర్వహించారు.

పచ్చని పొలాలకు సిందూర తిలకం



అమలాపురం టౌన్: తివాచీలా పరుచుకున్న ఆకు పచ్చని చేలు.. పచ్చని గొడుగు పట్టినట్లుగా కొబ్బరి చెట్లు.. నింగిలో సాయం సంధ్య వేళ ఆ పచ్చని మోముపై సింధూర తిలకం అద్దినట్లు ఎరుపు వర్ణం సూరీడు ఇవి అందరినీ ఆకర్షించాయి. అమలాపురం పట్టణం గాంధీనగర్ శివారులో శుక్రవారం సాయంత్రం వేళ పంట పొలాలు, ఎరుపెక్కిన నింగిలో కనిపించిన సుందర వర్ణం ఆకట్టుకుంది.

నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దు

మలికిపురం: నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 36వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీనికి ప్రిన్సిపల్ ఎస్.ఆనందమహాని అధ్యక్షత వహించారు. రిసోర్స్ పర్సన్‌గా రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలని, కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం తాగా వాహనాలు నడపరాదని అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సఖినేటిపల్లి ఎస్సై కె.శ్రీనివాస్, మలికిపురం ఏఎస్ఐ టి.నరసింహారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నక్క రమేష్‌బాబు, టి.ఆంజనేయులు, ఆర్ఆర్‌కే రాజు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.